సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం : 23 : అక్టోబర్ : 2024



డీఎస్సీ-98 ఉపాధ్యాయులపై వివక్ష

అన్ని రికార్డు పనులు, బోధన ఇతర ఉద్యోగుల్లాగే సక్రమంగా చేస్తున్నా తమకు ఏ రాయితీలు వర్తించడం లేదని డీఎస్సీ-98 కాంట్రాక్ట్ ఉద్యోగులు వాపోతున్నారు. 8లో ▸



రాజమండ్రిలో సంచరించిన చిరుతేనా?

ద్వారకాతిరుమల మండలంలో సంచరిస్తున్న చిరుత.. ఇటీవల రాజమండ్రి వద్ద కనిపించిన చిరుత ఒక్కటేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. 8లో ▸



గాంధీ భవనం వద్ద మద్యం దుకాణమా?

గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలు తెలిపేందుకు పెదనిండ్రకొలనులో నిర్మించిన మహాత్మాగాంధీ భవనం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆర్టీసీకి రూ.48 లక్షల ఆదాయం



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్

భీమవరం (ప్రకాశంచౌక్): దసరా సందర్భంగా ఆర్టీసీ రూ.48 లక్షల అదనపు ఆదాయం సంపాదించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దసరా సందర్భంగా 218 బస్సులు అదనంగా నడిపినట్లు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా నాలుగు ఆదివారాలు పంచారామ క్షేత్రదర్శని టూర్ ప్యాకేజీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. జిల్లాలోని డిపోల నుంచి బయలుదేరి సోమ వారం ఒక్కరోజులోనే అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట దర్శించుకుని వచ్చేలా ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. నరసాపురం నుంచి రాయచూర్‌కు నూతన సర్వీసు ప్రారంభానికి అనుమతి లభించిందని నవంబర్ మొదటి వారంలో సర్వీసును ప్రారంభిస్తారని తెలిపారు.

మున్సిపల్ డ్రైవర్ల నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న క్లాప్ డ్రైవర్లు

తణుకు: మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో గాంధీ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత మూడేళ్లుగా మున్సిపాల్టీ పారిశుద్ధ్య విభాగంలో క్లాప్ వాహనాల డ్రైవర్లుగా పని చేస్తున్నారని, ప్రభుత్వం మారింది కాబట్టి తొలగిస్తామని చెప్పడం చట్ట వ్యతిరేకమని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు.

స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



విద్యుత్ శాఖ జేఈ ఏడుకొండలుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్: టీడీపీ అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు సన్నాహాలు చేస్తుందని, ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరంలోని తాడేరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు విద్యుత్ చార్జీలు భారం మోపకుండా, స్మార్ట్ మీటర్లు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. జేఈ ఏడుకొండలుకు వినతిపత్రం ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక రూ. 8,114 కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతల కృపానందం, భూపతి తిమోతి, యాకోబు, యోహాను తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఏర్పాటుచేసిన ఆధార్ సవరణ ప్రత్యేక మొబైల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తహసీల్దార్లను ఆదేశించారు. అక్టోబర్ 22 నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక మొబైల్ క్యాంపులను జిల్లాలో నిర్వహిస్తున్నారు. కొత్తగా ఆధార్ నమోదు, ఐదు నుంచి 15 ఏళ్ల వయసున్న వారికి 15 నుంచి 17 ఏళ్ల వయసున్న వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేషన్, డెమోగ్రాఫిక్ అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్, డాక్యుమెంట్ అప్డేట్ సర్వీస్ వంటి సేవలను ఈ ప్రత్యేక క్యాంపుల ద్వారా పొందవచ్చన్నారు. జిల్లాలో మొత్తం 88 ఆధార్ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు.

బాబు వచ్చే.. జాబు పోయే

- చిరుద్యోగుల కడుపుకొడుతున్న కూటమి సర్కారు
- వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని హామీ
- వలంటీర్ల కొనసాగింపుపై నోరు మెదపని ప్రభుత్వం
- మద్యం పాలసీతో రోడ్డున పడ్డ 893 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



సాక్షి, భీమవరం: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెడుతోంది. కొత్త ఉద్యోగాల కల్పన చేయక పోగా గత ప్రభుత్వంలో నియమించిన చిరుద్యోగుల కడుపు కొడుతోంది. ప్రభుత్వ వైఖరితో వలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారగా మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగులు రోడ్డున పడ్డారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పేదల వద్దకు ప్రభుత్వ పథకాలను చేరవేసే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తెచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 50 ఇళ్లకు, పట్టణ ప్రాంతాల్లో 75 నుంచి 100 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున జిల్లాలో 8,616 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించారు. రూ. 5 వేల జీతంతో ప్రభుత్వ పథకాలను చేరవేయడం, అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయించడం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు తదితర సేవలందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేశారు. కోవిడ్ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు.

వలంటీర్లకు మొండిచేయి

దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై కూటమి నేతలు మొదటి నుంచి విషం చిమ్ముతున్నారు. తమ అనుకూలవర్గంతో ఫిర్యాదులు చేయించడం ద్వారా ఏప్రిల్ నుంచి వారి సేవలు నిలిచిపోయేలా చేశారు. ఎన్నికల్లో వారిని ఆకట్టుకునేందుకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని హామీలు గుప్పించారు. మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తుండగా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవడంపై నోరు మెదపడం లేదు. అధికశాతం మంది మహిళలే వలంటీర్లుగా సేవలందిస్తూ వచ్చారు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం తమ కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉండేదని వారంటున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా తమను విధుల్లోకి తీసుకోవాలని పలుమార్లు వలంటీర్లు ప్రభుత్వానికి వినతులు అందజేసినా ఫలితం లేదు.

మద్యం అమ్మకాలు పెంచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మద్యం షాపులను ప్రైవేట్ పరం చేయడంతో వారంతా ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరుతూ ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలుమార్లు శాంతియుతంగా ధర్నాలు నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు వారితో చర్చలు జరిపి సానుకూలంగా స్పందించడంతో సమ్మె పిలుపును విరమించుకుని విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండానే గాలికొదిలేయడంతో ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడాల్సి వచ్చింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో గతంలో నియమించిన పలువురు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం ద్వారా కూటమి నేతలు తమకు కావాల్సిన వారిని నియమిస్తూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాలు వస్తాయనుకుంటే ఉన్న వాటిని తొలగించడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డున పడ్డ చిరుద్యోగులు

ప్రైవేట్ మద్యం పాలసీ తెచ్చి ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేయడంతో వాటిలో పనిచేస్తున్న చిరుద్యోగులు రోడ్డున పడ్డారు. టీడీపీ పాలనలో ఏరులై పారిన మద్యం అమ్మకాలను కట్టడి చేసేందుకు గత ప్రభుత్వం ప్రభుత్వ మద్యం పాలసీని తెచ్చింది. ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం దుకాణాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. ఒక్కో షాపులో సూపర్ వైజర్, సేల్స్‌మెన్, నైట్ వాచ్‌మెన్‌లు నలుగురు నుంచి ఐదు మంది వరకు సిబ్బంది చొప్పున జిల్లాలో 202 మద్యం దుకాణాలకు సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లుగా 643 మంది, నైట్ వాచ్‌మెన్లుగా 250 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఏపీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ద్వారా వీరిని నియమించారు. సూపర్‌వైజర్లకు రూ.21,500, సేల్స్‌మెన్లకు రూ.19,500, నైట్ వాచ్‌మెన్లకు రూ.9,500 వేతనంగా అందజేశారు.

ఏం చేయాలో పాలుపోవడం లేదు



మొన్నటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేశాను. కొత్త మద్యం పాలసీలో ప్రభుత్వ దుకాణాలు ఎత్తివేయడంతో మా ఉద్యోగాలు కోల్పోయి ఖాళీగా ఉన్నాం. ఏం చేయాలో పాలుపోని పరిస్థితితో ఇబ్బంది పడుతున్నాం.

– పంజా ప్రసాద్, వీరవాసరం

మా ఉద్యోగాలు ఉన్నాయో? లేవో?



వలంటీర్లుగా ప్రభుత్వం తరపున ప్రజలకు అన్ని సేవలందించాం. గత ఏడు నెలలుగా వలంటీర్లను విధులకు దూరం ఉంచడంతో కుటుంబ పోషణ భారంగా వుంది. నెలకు రూ.10 వేలు జీతం ఇస్తామని టీడీపీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇవ్వడంతో చాలా ఆనందించాం. కూటమి గెలిచి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా మా ఉద్యోగాలు ఉన్నాయో? లేవో? అయోమయ పరిస్థితిలో ఉన్నాం.

– గల్లి అభి, వలంటీర్, వేల్పూరు

ఉపాధి పనులతో వలసలు నిరోధించాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను లక్ష్యానికి మించి చేపట్టి, వలసల నిరోధానికి కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పనులపై డ్వామా అధికారులు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 42 లక్షల పని దినాల కల్పన లక్ష్యం కాగా ఇంతవరకు 30,48,005 పనిదినాలు కల్పించి 72.57 శాతంతో రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలిచామన్నారు. గత ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన పనులు పూర్తిచేసేలా క్లోజర్ ఆఫ్ వర్క్స్‌పై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో మంజూరైన 850 పశువుల షెడ్లకు ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలన్నారు. పుంతరోడ్లను ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ కెసీహెచ్ అప్పారావు, పశు సంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు షెడ్యూల్

నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి షెడ్యూల్ విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం షెడ్యూల్‌ను ప్రకటించి, గెజిట్ నోటిఫికేషన్ ప్రచురణకు పంపామన్నారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 21తో ప్రారంభమై నవంబర్ 29తో ముగుస్తుందన్నారు. ఆయా మండలాలకు తహసీల్దార్లను, జల వనరుల శాఖ ఏఈలను ఆథరైజ్డ్ అధికారులుగా నియమించామన్నారు. నవంబరు 1, 2 తేదీల్లో అభ్యంతరాలు ప్రకటన, నవంబర్ 3న పరిష్కారం, నవంబర్ 6 నుంచి 10 వరకు భూ యజమానుల జాబితా, ఓటర్ల జాబితా తయారీ ఉంటుందన్నారు. నవంబరు 21 నుంచి 23 మధ్య అన్ని నీటి వినియోగదారుల సంఘాల్లోని సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని చెప్పారు. నవంబరు 24 నుంచి 26 మధ్య నీటి పంపిణీ సంఘాలకు, నవంబర్ 27 నుంచి 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు.

రోడ్లు నిర్మించాలంటూ సీపీఐ దీక్షలు



ప్రకాశంచౌక్ సెంటర్‌లో సీపీఐ నిరసన దీక్ష

భీమవరం: భీమవరం పట్టణానికి రావాలంటే అధ్వానంగా ఉన్న రోడ్లపై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తక్షణం రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్లు నిర్మాణం కోరుతూ మంగళవారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో చేపట్టిన 32 గంటల నిరవధిక నిరహార దీక్షలను నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. భీమవరం రావాలంటే గోతుల రోడ్లపై ప్రయాణం చేసే పరిస్థితి ఉందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 5 నెలల కావొస్తున్నా రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని రహదారులు పెద్ద పెద్ద గోతులతో చెరువులను తలపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరనాథరెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

ఏలూరుపాడులో 144 సెక్షన్ పొడిగింపు

కాళ్ల: కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నేటి నుంచి మరో 15 రోజుల పాటు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు కాళ్ళ ఎస్సై శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు ఆకివీడు సీఐ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి నవంబరు 5 వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. ఏలూరుపాడు, కాళ్ళ, పెదఅమీరం గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు సైతం ఈ సెక్షన్ వర్తిస్తుందన్నారు. ఎక్కడా గుంపులుగా ఉండరాదని స్పష్టం చేశారు. సభలు సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు.

బీఎస్సీ ఆనర్స్ మూడో దశ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఐదు అనుబంధ కళాశాలలు, గుర్తింపు పొందిన మూడు కళాశాలల్లో బీఎస్సీ ఆనర్స్‌లో ప్రవేశం కోసం గతంలో నమోదుచేసుకున్న విద్యార్థులకు మూడోదశ మాన్యువల్ కౌన్సెలింగ్ జరగనుందని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీలో నిర్వహిస్తారని చెప్పారు.

శ్రీవారి ఆలయంలో మాక్ డ్రిల్



తుపాకులతో మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

ద్వారకాతిరుమల: అనుకోని విపత్తు ఎదురై.. ఉగ్రవాదులు, సంఘ విద్రోహ సంస్థలు దాడులు జరిపినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు స్థానిక పోలీసులు, ఆక్టోపస్ సిబ్బంది సోమవారం రాత్రి ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము వరకు ఆలయంలోను, పరిసర ప్రాంతాల్లో ఈ డ్రిల్ జరిగింది. ఉగ్రవాదులు, సంఘ విద్రోహుల దాడులను ఎలా తిప్పికొట్టాలి అనే అంశాలపై డ్రిల్ నిర్వహించారు. ఆలయ గోపురాలు, ప్రహరీపై, అలాగే దర్శనం క్యూలైన్లలో, ఆళ్వార్ల మండపాల పైకి ఎక్కి ఉగ్రవాదులను తుపాకులతో కాల్చుతున్నట్టు డ్రిల్ జరిపారు. ఏఆర్‌సీపీఎల్ పార్టీ అన్ని రాష్ట్రాల హోల్డర్‌లతో కూడిన రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక, విద్యుత్, నీటి కార్మికులు ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ రాజారెడ్డి, డీఎస్పీ ఎన్వీ రమణ, సీఐ యుజే విల్సన్, ఎస్ఐ టి.సుధీర్‌ల పర్యవేక్షణలో డ్రిల్‌ను నిర్వహించారు.

కూటమి పాలనకు అమాయకులు బలి

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజం



తణుకు అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసమర్థ పాలనతో అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటూ మరణమృదంగం మోగిస్తోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఈ సర్కారు పరిపాలనను గాలికి వదిలేసిందని విమర్శించారు. తణుకులోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం జిల్లా గుర్లలో అతిసారంతో 16 మంది అమాయకులు మరణించడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో తాగునీరు కలుషితమై ప్రజలు మృత్యువాత పడడం అత్యంత దారుణమని చెప్పారు. ఈ మరణాలు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగినవేనన్నారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించి బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విజయవాడ వరద ముంపు, గుర్ల వంటి ఘటనల్లో అమాయక ప్రజలు బలవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. నిత్యం రాష్ట్రంలో చిన్నారుల నుంచి మహిళల వరకు మానభంగాలు, హత్యలకు గురవుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. తప్పుడు కేసులు బనాయించి అరెస్టులకు దిగడమే పనిగా పెట్టుకుని పరిపాలన గాలికొదిలేశారని మండిపడ్డారు. మద్యంలో, అభివృద్ధి పనుల్లో పర్సంటేజీలతో దోచుకోవాలనే ఆరాటమే తప్ప ప్రజలకు మంచి పాలన అందించాలనే ఉద్దేశమే ప్రభుత్వానికి లేదని చెప్పారు. ఇసుక ఉచితంగా అందిస్తామని డాంబికాలు పలికిన ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని గుర్తుచేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసా ఇవ్వకుండా ఈ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టికొట్టిందని ఆయన పేర్కొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు 4వ విడత కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం 4వ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ మూడు విడతల్లో జరిగిన ప్రవేశాల అనంతరం మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం 4వ విడత కౌన్సెలింగ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఈ నెల 26 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు సమర్పించాలని సూచించారు. విద్యార్థులు సమర్పించిన దరఖాస్తు కాపీని తాము ఎంచుకున్న ఐటీఐ కళాశాలల్లో ఈ నెల 27 సాయంత్రం 3 గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులవుతారన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 28న, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈ నెల 30 తేదీల్లో నిర్వహిస్తామన్నారు.

వరికి వరుస వాయుగండాలు

- అగమ్యగోచరంగా అన్నదాతల పరిస్థితి
- సుడులు తిరిగి పడిపోతున్న స్వర్ణ రకం



వీరవాసరం మండలం తోకలపూడిలో సుడులు తిరిగి నేల వాలిన స్వర్ణ రకం వరి పంట

భీమవరం: జిల్లాలో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సార్వా సీజన్‌లో నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సాయం అందకపోగా.. వరుస వాయుగుండాలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. భారీ వర్షాలతో ముందుగా నాట్లు వేసిన స్వర్ణ రకం పంట సుడులు తిరిగి నేలవాలుతుండడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సార్వా సీజన్‌లో రైతులు సుమారు 2.09 లక్షల ఎకరాల్లో స్వర్ణ, ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153, పీఆర్ 126 వరి రకాలు నాట్లు వేశారు. జూన్‌లో నారుమళ్లు, నాట్లు వేసిన రైతులు ఎడతెరపిలేని వర్షాలతో సుమారు 30 వేల ఎకరాల్లో నాట్లు, 15 వేల ఎకరాల్లో నారుమళ్లు దెబ్బతినడంతో రైతులు తిరిగి నారుమళ్లు, నాట్లు వేసుకున్నారు.

నేలవాలుతున్న స్వర్ణ రకం :

జిల్లాలో 2.09 లక్షల ఎకరాల్లో సార్వా సాగు చేయగా రైతులు దాదాపు 63 వేల ఎకరాల్లో స్వర్ణ రకం నాట్లు వేశారు. ప్రస్తుతం స్వర్ణ రకం పైరు దాదాపు ఈనిక పూర్తిచేసుకుని గింజలు ఎర్రముక్కలు పడేదశకు చేరుకున్నాయి. మిగిలిన రకాలు ఈనిక, పొట్టదశలో ఉన్నాయి. అయితే స్వర్ణ రకం బంగాళాఖాతంలో వరుస వాయుగుండాలు కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు సుడులు తిరిగి నేలవాలిపోతోంది. దీంతో పడిపోయిన పైరుపై ఎక్కువగా దోమపోటు ఆశించడమేగాక నేలనంటిన గింజలు మొలకలు వచ్చే ప్రమాదముందని దీంతో పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి సాగు చేయగా పంట చేతికి వచ్చే సమయంలో వాతావరణం అనుకూలించకపోతే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రద్ధ తీసుకుంటే నష్ట నివారణ

నేలనంటుతున్న స్వర్ణ రకం వరి పంట నష్టం తగ్గించుకోవాలంటే రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పడిపోయిన పైరును కట్టలు కట్టి నిలబెట్టుకోవాలి. పొటాషియం నైట్రేట్ 5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పంట పూర్తిగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి. గింజలు మొలకెత్తకుండా ఉండడానికి 10 గ్రాముల ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

జాబ్‌మేళాలో 98 మందికి ఉపాధి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 98 మంది యువతకు ఉపాధి లభించిందని డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు మొత్తం 254 మంది యువత హాజరు కాగా వారిలో 98 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు.

ఉచితంగా డీఎస్సీ శిక్షణ

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు వి.జయప్రకాష్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డీఎస్సీ పరీక్షకు హాజరవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉండాలన్నారు. గడువు ఈ నెల 25 వరకు పొడిగించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

బహిరంగంగా మద్యం సేవించిన వారికి జరిమానా



మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

భీమవరం: స్థానిక టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారికి రూ.500 జరిమానా విధించినట్లు సీఐ జి.కాళీచరణ్ మంగళవారం తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తుండగా ఈనెల 18న స్థానిక చిన్న బైపాస్ రోడ్డులో మద్యం సేవిస్తున్న వి.హనుమంతురావు, ఎం శ్రీనివాసరావు, బంగారం ప్రసాద్, ఆర్ రాజు, 21వ తేదీన కె.సురేష్, ఆర్ కుమార్, మణికంఠ, డి.పవన్‌కుమార్, ఐ.రమణ, యు.మణిదీలను అరెస్టు చేశామన్నారు. వీరిని భీమవరం స్పెషల్ జ్యుడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వద్ద మంగళవారం హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించినట్లు సీఐ కాళీ చరణ్ చెప్పారు.

ఫెన్సింగ్ సెలక్షన్స్ ప్రారంభం



ఫెన్సింగ్ సెలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని, క్రమశిక్షణ, పట్టుదలతో ఏ రంగంలోనైనా రాణించవచ్చునని ఆదికవి నన్నయ్య యునివర్సిటీ వైస్ చాన్సలర్ వై.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఇంటర్ కాలేజెస్ మెన్, ఉమెన్ పెన్సింగ్ సెలక్షన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ కళాశాలల నుంచి 60 మంది క్రీడాకారులు ఫెన్సింగ్ సెలక్షన్స్‌లో పాల్గొన్నారని, ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 6వ తేదీన జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే నేషనల్ పెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సభ్యుడు ఎ.సత్యనారాయణ, కళాశాల ట్రెజరర్ వడుపు గోపి, సెలక్షన్ కమిటీ సభ్యుడు పి.శ్రీను, ఏపీ పెన్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ జి.కృష్ణ మోహన్, ఫిజికల్ డైరెక్టర్స్ సీహెచ్ సతీష్, బీవీ నర్సింహరాజు, బొమ్మదేవర ప్రభాకర్, గెద్దం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ-98 ఉపాధ్యాయులపై వివక్ష

- కనీసం మట్టి ఖర్చులూ ఇవ్వడం లేదు
- చాలీచాలని జీతాలతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేక అవస్థలు



ఏలూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు (ఫైల్)

దెందులూరు : వయస్సు మీరాక ఉద్యోగాలు వచ్చాయని సంబర పడాలో... ఉద్యోగం వచ్చినా ఆ సంతోషం తాత్కాలికం అని బాధపడాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని డీఎస్సీ-98 కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023లో ఏప్రిల్ 13న డీఎస్సీ-98 అభ్యర్థులకు మినిమమ్ టైం స్కేల్ విధానంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ప్రభుత్వం ఉద్యోగాలిచ్చింది. 25 ఏళ్ల నిరీక్షణ అనంతరం కాంట్రాక్ట్ టీచర్లుగా ఎంపిక కావడం బాగానే ఉంది. కొందరు విధులు నిర్వహిస్తుంటే మరికొందరు వెంటనే రిటైర్ అయ్యారు. ఏలూరు జిల్లాలో 275 మందికి ఉద్యోగాలొచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా ఉదయం 9 గంటలకు వెళ్లి సాయంత్రం వరకు అన్ని రికార్డు పనులు, బోధన, ఇతర అంశాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ఏ రాయితీలు తమకు వర్తించడం లేదని కాంట్రాక్ట్ ఉద్యోగులు వాపోతున్నారు. కనీసం చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

ప్రశ్నార్థకంగా భవిష్యత్

ఉద్యోగ భద్రత లేకపోవడంతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్దుబాటు పేరిట ఇతర పాఠశాలలకు కేటాయించడంతో ప్రయాణాల్లో జరిగిన ప్రమాదాల్లో ఇటీవల నలుగురు, ఐదుగురు కాంట్రాక్ట్ టీచర్లు ఒత్తిడి తట్టుకోలేక మృతి చెందారన్నారు. వారిని, వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వం గాలికి వదిలేసిందని.. పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. చాలీచాలనీ జీతాలతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేక, నివాసం ఉండలేక, బతుకు బండిని లాగలేక భవిష్యత్‌పై ఆశతో కాలం వెళ్లదీస్తున్నామంటున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

తమ సమస్యలు ఇలా ఉన్నాయని ప్రభుత్వానికి నేరుగా వెళ్లి చెప్పినా, వినతి పత్రాలు ఇచ్చినా రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి నుంచి ఏ స్పందన లేకపోవడం బాధిస్తోందన్నారు. తమలో ఉద్యోగాలు పొందిన వారు చాలా మంది 50 ఏళ్లు వయస్సు ఉన్నవారే. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో క్వాలిఫై టీచర్లకు ఉద్యోగాలిచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి నేడు అన్నం పెట్టినవారయ్యారని వారు చెబుతున్నారు.

వివక్షకు గురవుతున్నాం



గత ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఆధారం లేని మాకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం కల అన్న ఆలోచనను తుడిచివేశారు. ప్రస్తుత ప్రభుత్వం పనితీరుతో ఉద్యోగాలు వచ్చాయన్న సంతోషం ఆవిరై పోయింది. కేవలం ప్రభుత్వ ఉద్యోగం అన్న అర్హతే తప్ప చాలా వివక్షకు గురవుతున్నాం.

– తోట ఎడ్వర్డ్, డీఎస్సీ -98 టీచర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

రాయితీలు వర్తింపజేయాలి



మాకు కూడా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే అన్ని రాయితీలు వర్తింప చేయాలి. ఎంపిక, అర్హత, విద్యాబోధన, పాఠశాలలో పని, పాఠశాల వేళలు అన్ని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే రాయితీలు మాకు ఇవ్వడం లేదు. ఇది చాలా బాధాకరం.

– హానోపు, టీచర్, కామవరపుకోట

వివక్ష తొలగకపోతే ఆలోచిస్తాం



ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులపై వివక్ష ధోరణి విడనాడాలి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వర్తింపచేయాలి. సమస్యలు చెప్పినప్పుడు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి పరిశీలిస్తామని కూడా చెప్పడం లేదు. ఇదే విధానం కొనసాగితే భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయిస్తాం

– వల్లూరి వరిభూషణ్, టీచర్, చింతలపూడి

లాకు పరికరాల చోరీ.. పట్టించుకోని అధికారులు



చోరీ అనంతరం ఎస్ ఇల్లిందలపర్రు లాకు ఇలా..

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం ఎస్ ఇల్లిందలపర్రు వద్ద గోస్తనీ పంట కాలువపై ఉన్న లాకు ఇనుప పరికరాలు రెండు సార్లు చోరీకి గురైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. సుమారు రెండు వేల కిలోల బరువు ఉన్న లాకు గడ్డర్లు, గేర్ బాక్సులు, స్క్రూ రాడ్‌లు నెల రోజుల్లో రెండు సార్లు చోరీ అయ్యాయి. వీటిపై అధికారులు మొక్కుబడిగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసి చేతులు దులుపుకున్నారు. 1959లో నిర్మించిన ఈ లాకు శిథిలావస్థకు చేరింది. షెట్టర్లకు మాత్రమే మరమ్మతులు చేసి పదేళ్లుగా నెట్టికొస్తున్నారు. పడవలు వెళ్లే లాకు పూర్తిగా మూసివేశారు. దీంతో దిగువ భాగంలో పూర్తిగా పాడైన తలుపులు తీసి పక్కన పెట్టారు. ఎగువ భాగంలో ఉన్న డోర్లకు కొద్దిపాటి మరమ్మతులు చేస్తూ సాగునీటి వృథాను అరికడుతున్నారు. ఈ లాకులపై సూపరింటెండెంట్, ఇద్దరు లష్కర్లు కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్నారు. ఆగష్టు 26న, సెప్టెంబర్ 21న లాకు పరికరాలు చోరీకి గురయ్యాయని, వీటిపై పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని లాకు సూపరింటెండెంట్ వాసంశెట్టి తేజ త్రినాథ్ చెబుతున్నారు. గత నెల 23న అందిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ సిబ్బందిని విచారించి దర్యాప్తు చేస్తున్నామని పెనుమంట్ర ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

రాజమండ్రిలో సంచరించిన చిరుతే ఇది

- ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో సంచారం
- చిరుతను పట్టుకునేందుకు 15 ట్రాప్, 2 లైవ్ కెమెరాల ఏర్పాటు



ద్వారకానగర్ ప్రాంతంలో ట్రాప్ కెమెరా



ఎం.నాగులపల్లి శివారులో చిరుత పాద ముద్ర



ద్వారకానగర్‌లో ఏర్పాటు చేసిన బోను



అంబర్‌పేట వసంతనగర్ వరి క్షేత్రాల్లో..

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం నాగులపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుత.. ఇటీవల రాజమండ్రి వద్ద దివాన్ చెరువులో కనిపించిన చిరుత ఒక్కటేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. నాలుగు రోజులుగా ఎం నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుత పులిని పట్టుకునేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పులి బోను ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని, పరిసరాలను మంగళవారం వారు పరిశీలించారు. ఎం నాగులపల్లి పంచాయతీ శివారు చెరకు తోటల్లో చిరుత పాదముద్రలను గుర్తించారు. ఇదిలా ఉంటే ద్వారకానగర్‌లోని శ్రీ కార్తికేయ ఫ్లైయాష్ బ్రిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోని ఒక పాడుబడిన షెడ్‌లో చిరుత ఆవాసం ఏర్పాటు చేసుకున్నట్టు అధికారులు గుర్తించి, ఆయా ప్రాంతాల్లో 15 ట్రాప్, రెండు లైవ్ కెమెరాలను అమర్చారు. దాని కదలికలను కనిపెట్టి, ఎలాగైనా పట్టుకోవాలని అణువణువునా జల్లెడ పడుతున్నారు. అయితే రాజమండ్రి ప్రాంతం నుంచి రాత్రి వేళల్లో సంచరిస్తూ, రోడ్లు దాటుకుంటూ, కుక్కలను మాత్రమే ఆహారంగా తింటూ చిరుత ఇక్కడకు చేరినట్టు భావిస్తున్నారు. చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో రైతులు ఉదయం 8 దాటిన తరువాతే పొలాల్లోకి వెళ్లాలని, చేతి కర్ర వెంటబెట్టుకోవాలని అధికారులు సూచించారు.

అంబర్‌పేట సమీపంలో చిరుత సంచారం

భీమడోలు: ఎం.నాగులపల్లి శివారులో పాడైన ఓ ఫ్యాక్టరీలో కెమెరాలు, బోన్లు ఏర్పాటు తరుణంలో అలజడికి చిరుత మంగళవారం అక్కడ నుంచి సమీపంలోని భీమడోలు మండలం అంబర్‌పేట సమీపంలోని వసంతనగర్, పోలసానిపల్లి వ్యవసాయ క్షేత్రాల్లో సంచరించినట్లు రైతుల చెబుతున్నారు. పంట పొలాలకు వెళ్లే దారులు, తాడిపూడి కాల్వ రోడ్డుపై చిరుత పాద ముద్రలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో 60 ట్రాప్, లైవ్ కెమెరాలను ఏలూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి కుమార్ తెలిపారు.

రసం పీల్చే పురుగుల సమగ్ర సస్యరక్షణ



వరిపై మానుపండు వ్యాప్తిని రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త భువనేశ్వరి

పెనుమంట్ర: పంటపై ఆశించే పురుగులను బట్టి సస్యరక్షణ మందులు ఎంపిక చేసుకోవాలని పురుగుల విభాగం ప్రధాన శాస్త్రవేత్త ఎస్ దయాకర్ అన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారులు, విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో మంగళవారం రెండో రోజు శిక్షణలో దయాకర్ మాట్లాడారు. రసం పీల్చే పురుగుల నివారణకు, అంతర వాహిక మందులు కొరికి తినే పురుగులకు ఉదార చర్య లేదా తాకుడు చర్య గల పురుగు మందులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నల్లజాతి పురుగుల నివారణకు ప్రత్యేకమైన స్పైరోమెసిఫెన్ వంటి నల్లి మందులను ఎంపిక చేసుకోవాలన్నారు. గాలి వాటం ఎక్కువగా ఉన్నప్పుడు మందులు పిచికారీ చేయవద్దని, మందులు పిచికారీ చేసే సమయంలో రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అమలాపురం డాట్ సెంటర్ కోఆర్డినేటర్ ఎం నందకిశోర్ మాట్లాడుతూ పురుగుల ఆర్థిక నష్టపరిమితి దాటిన తరువాతే మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. వరి తొలిదశలో సింథటిక్ పైరిత్రాయిడ్, క్రొఫినోఫాస్ వంటి మందులు పిచికారీ చేయడం, నత్రజని ఎరువులు విచక్షణా రహితంగా వాడటం వల్ల దోమ ఉధృతి పెరిగే అవకాశం ఉందని వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు వి.భువనేశ్వరి, పీవీ రమేష్‌బాబు, ఎస్ వెరోనిక, వి.రోజా, కేంద్రీయ సస్యరక్షణ విభాగం జాయింట్ డైరెక్టర్ ఎ.సిద్దిఖి, కె.వీరయ్యచౌదరి, ప్లాంట్ ప్రొడక్షన్ ఆఫీసర్ సురేష్, అసిస్టెంట్ ఆఫీసర్ ఎ.ఉదయ్‌శంకర్, ఎంవీ కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు, విత్తనోత్పత్తి కార్యక్రమాలు అభినందనీయం



వరి రకాల ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించిన విత్తనాభివృద్ధి పరిశీలన కేంద్ర బృందం

పెనుమంట్ర: భారత వ్యవసాయ పరిశోధనా మండలి కొత్త ఢిల్లీ విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు మంగళవారం మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. స్థానిక శాస్త్రవేత్తలతో కలిసి రాష్ట్రంలో సాగులో ఉన్న వరి రకాల ప్రదర్శనా క్షేత్రాన్ని పరిశీలించారు. మూలవిత్తనోత్పత్తి క్షేత్రం, ప్రజనకారుణి విత్తనోత్పత్తి క్షేత్రాలు, విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కర్మాగారాలను సందర్శించి స్థానిక శాస్త్రవేత్తలకు పలు సలహాలు, సూచనలను అందజేశారు. మార్టేరు పరిశోధన స్థానంలో చేస్తోన్న పరిశోధనలు, విత్తనోత్పత్తి కార్యక్రమాలపై స్థానిక శాస్త్రవేత్తలను అభినందించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం తరపున విత్తన సంచాలకులు వై.సతీష్, ప్రధాన శాస్త్రవేత్త కృష్ణనాయక్, పరిశోధనా సహసంచాలకులు టి.శ్రీనివాస్, వరి ప్రధాన శాస్త్రవేత్త ఎం గిరిజారాణి, కేంద్ర విత్తనాభివృద్ధి ప్రధానశాస్త్రవేత్తల సందీప్‌కుమార్‌లాల్, అశ్వనీకుమార్, భోజరాజ నాయక్, బెంగుళూరుకు చెందిన విత్తనాభివృద్ధిశాస్త్రవేత్త ప్రతాప్ భాన్‌సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బనోద్ దినేష్, ఉత్తర ప్రదేశ్ శాస్త్రవేత్తలతో కూడిన బృందం పాల్గొన్నారు. విత్తనాభివృద్ధిపై చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించారు.

యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి: తండ్రి మందలించాడనే కోపంతో ఆదివారం సాయంత్రం చించినాడ వద్ద వశిష్ట గోదావరి నదిలో దూకిన పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఈద కోదండరాం (19) మృతదేహం మంగళవారం సాయంత్రం సఖినేటిపల్లిలంక వద్ద లభ్యమైందని ఎస్సై కర్ణీడి గురయ్య తెలిపారు. కోదండరాం ఏ పనీ చేయకుండా ఇంట్లోనే ఉండడంతో తండ్రి రాము మందలించారు. దీంతో ఇంటి నుంచి వచ్చేసిన కోదండరాం గోదావరిలో దూకాడు. అతని పాదరక్షలు చించినాడ వంతెనపై కనిపించడంతో తండ్రి రాము సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గోదావరిలో మూడు రోజులు గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి శవపంచనామా నిర్వహించిన పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని ఎస్సై గుర్రయ్య వివరించారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



ఇద్దరు పిల్లలతో ఝాన్సీలక్ష్మి

తణుకు: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైంది. రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన నల్లి నగేష్, ఝాన్సీలక్ష్మిలకు 11 ఏళ్ల క్రితం వివాహం కాగా, వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఝాన్సీలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి గత నెల 29న ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై మూర్తి తెలిపారు.

వరిలో సస్యరక్షణకు ఫొటోల చిత్రీకరణ



అజ్జమూరులో వరి తెగుళ్ల గుర్తింపునకు సెల్‌ఫోన్‌ల ద్వారా ఫొటోలు చిత్రీకరిస్తున్న ఆర్‌ఎస్కేలు

ఆకివీడు : పంట జీవిత కాలచక్రంలో (క్రాఫ్ లైఫ్ సిస్టమ్) ఏర్పడే పరిణామాలు, తెగుళ్లు, క్రిమికీటకాలు ఆశించే తీరుల్ని శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్ రూపొందించిందని జిల్లా వనరుల శాఖ ఏఓ జి.బాలనాగేశ్వరమ్మ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వనరుల శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందికి సెల్ ఫోన్ల ద్వారా ఫొటోలు చిత్రీకరించి అప్‌లోడ్‌చేసే విధానంపై శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించినట్టు ఆమె చెప్పారు. మంగళవారం స్థానిక ఏఓ కార్యాలయంలో, సిద్ధాపురం, అజ్జమూరు గ్రామంలోని వరి పొలాల్లో ఫొటో చిత్రీకరణ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఆయా దశల్లో ఉన్న పంటల్ని సెల్‌ఫోన్‌ల ద్వారా ఫొటోలు చిత్రీకరించి యాప్‌లో అప్‌లోడ్‌చేస్తారని తెలిపారు. ఈ ఫొటోల్ని కేంద్ర కార్యాలయంలో శాస్త్రవేత్తలు పరిశీలించి, పంటల్ని ఆశించిన తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన మందుల వినియోగంపై యాప్ ద్వారా సూచనలిస్తారని వివరించారు. విటిని రైతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని నాగేశ్వరమ్మ వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక, ఆర్‌ఎస్కేలు పాల్గొన్నారు.

గాంధీ భవనం వద్ద మద్యం దుకాణమా?



గాంధీ భవనం సమీపంలో మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న గాంధేయవాదులు, విద్యార్థులు (ఫైల్)



మద్యం దుకాణం ఏర్పాటు చేయనున్నట్టు చెబుతున్న గాంధీ భవనం గేట్లో నుంచి కనిపిస్తున్న షెడ్డు ఇదే

- గాంధేయవాదులు, విద్యార్థుల ఆవేదన
- అక్టోబర్ 2న ఫలించని ఆందోళన
- ఇప్పుడు గాంధీ భవనం ఎదురుగా షాపు ఏర్పాటుకు యత్నం

నిడమర్రు: దివంగత మాజీ మంత్రి, గాంధేయవాది చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు భవిష్యత్ తరగాలకు గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలను తెలిపేందుకు పెదనింద్రకొలనులో నిర్మించిన మహాత్మా గాంధీ భవనం వద్ద ప్రైవేటు మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దీన్ని నిరసిస్తూ జిల్లా సర్వోదయ మండలి సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి సభ్యులు, పెదనింద్రకొలను జెడ్పీస్కూల్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి గాంధీ భవనంలో మహాత్మా గాంధీ స్ఫూర్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ భవనం దేశంలోనే అతిపెద్ద కట్టడమని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి, విశ్రాంత డీఈఓ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఇటువంటి పవిత్రమైన భవనం సమీపంలో మద్యం అమ్మకాలు చేపట్టడం దారుణమని వాపోయారు. గాంధీ భవనం వద్ద నుంచి మద్యం షాపును ఊరికి దూరంగా తరలించాలని స్థానిక యువత సైతం సర్వోదయ మండలి సభ్యులకు మద్దతు తెలిపింది. తాజాగా ఈ మద్యం దుకాణాన్ని మహాత్మా గాంధీ భవనం ఎదురుగా నిర్మిస్తున్న షెడ్‌లోకి మార్చనున్నట్టు గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు

జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వరకు మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ పలు లేఖలు పంపించినట్టు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అయినా ఫలితం లేదని, గాంధీ భవనం ఎదురుగా మద్యం, మాంసం అమ్మేలా దుకాణాలు ఏర్పాటు చేయడంపై గ్రామ పెద్దలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాంధీ భవనంతోపాటు అక్కడే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మందుబాబుల వల్ల ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడతాయి. అక్కడే ప్రైవేటు మద్యం దుకాణం ఏర్పాటుచేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్థానిక మహిళలు హెచ్చరిస్తున్నారు. గాంధీ భవనం సమీపంలో మాంసం, మద్యం అమ్మకాలు, బెల్ట్ దుకాణాల నిర్వహణ జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మద్యం తయారీ కంపెనీలో సీఐడీ దాడులు

ఏలూరు టౌన్ / పెదవేగి : కూటమి సర్కారు మద్యం తయారీ కంపెనీలపై దాడులు చేయిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సీఐడీ అధికారులు మద్యం తయారీ కంపెనీల్లో తనిఖీలు చేస్తుండగా.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం ఒంగూరులోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ లిక్కర్ తయారీ కేంద్రంలో మంగళవారం ఉదయం దాడులు చేశారు. అధికారులు అర్ధరాత్రి వరకూ తనిఖీలు కొనసాగించారు. నాలుగేళ్ల కాలంలో ఏఏ బ్రాండ్లు తయారు చేశారు? నాణ్యతా ప్రమాణాలు, స్పిరిట్ శాతం, ఆల్కహాల్ శాతం ఎంత అనే అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తయారు చేసిన మద్యం బ్రాండ్లనే తయారు చేస్తున్నారా ? లేక కొత్త బ్రాండ్లలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కంపెనీ నుంచి మంగళవారం లారీల్లో ఎంత సరకు పంపిస్తున్నారో ఫొటోలు తీయటంతోపాటు, వివరాలు నమోదు చేసుకుంటున్నారు. కంపెనీ మేనేజర్ నాగేశ్వరరావు, కీలక సిబ్బందిని డిస్టిలరీ వద్దనే ఉంచటంతోపాటు వారి నుంచి ఆయా అంశాలపై వివరాలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

క్లుప్తంగా

చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు


పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ ప్రేమ్‌రాజ్

అత్తిలి: విద్యార్థులలో పోటీతత్వం ఉండాలని, నైతిక విలువలను కలిగి ఉండాలని అత్తిలి ఎస్సై పి ప్రేమరాజు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అమర్ ఆర్ట్స్‌అకాడమీ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం అత్తిలి మేడబడిలో బహుమతులు అందజేసారు. చిత్రలేఖన పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో ఎన్ నాగదుర్గాదేవి, టి సాయి సంజనశ్రీ, బి నరశింహ, జూనియర్ విభాగంలో పి నవ్య, బి శాంతి, ఎం గాయత్రి, సీనియర్ విభాగంలో కె ప్రవల్లిక, ఎం శర్వాణి, జి తులసి గెలుపొందారు. వీరికి ఎస్సై ప్రేమరాజు మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో అమర్ ఆర్ట్స్ అకాడమి అధినేత అమర్ మిత్ర, స్కూల్ హెచ్‌ఎం టీపీ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి 27 మంది హాజరు


తణుకులో ఉచిత వైద్యం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 27 మంది వైద్యసేవలు పొందారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వృద్ధులకు వైద్యసేవలందించి ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై కొండలరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని, వాహనం నడిపేటప్పుడు వాహనాన్ని ప్రక్కకు నిలిపి మాట్లాడుకోవాలని తాడేపల్లిగూడెం ట్రాఫిక్ ఎస్సై కె.కొండలరావు సూచించారు. పట్టణంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులతో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ వద్దని, హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని హితవు పలికారు. వాహనదారులు తప్పక వారి కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

యాగర్లపల్లిలో హెల్త్ సెంటర్ పరిశీలించిన సెంట్రల్ టీం


సెంట్రల్ టీంకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేషనల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ స్టాండర్డ్స్ (సెంట్రల్ టీం) సభ్యులు శ్రీధర్, రాజేష్‌లు సోమ, మంగళవారం రెండు రోజులు పాటు యాగర్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు ఆసుపత్రి క్వాలిటీ, ట్రీట్‌మెంట్, పరిసరాలు, రికార్డులు పరిశీలన, సూచనలు, సలహాలు అందజేశారు. వైద్యురాలు ఎం.తునూజ, సిబ్బంది హాజరైయారు. సెంట్రల్ టీంను పలువురు సత్కరించారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం

నరసాపురం: అధిక వర్షాలు, వాతావరణ మార్పులతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. మంగళవారం కమిషనర్ విష జ్వరాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు శానిటరీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పులతో డెంగీ జ్వరాల ప్రమాదం పొంచిఉందని అన్నారు. ప్రజలు డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పరిశుభ్రత విషయంలో వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

బాలల సత్వర వైద్య సేవల్లో జాప్యం

- గెస్ట్ డాక్టర్‌గా చంటి పిల్లల వైద్యులు
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న వైనం
- చిన్నారులతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం

తణుకు అర్బన్: రాష్ట్రీయ బాల స్వస్థ్య ఆరోగ్య కార్యక్రమంలో (ఆర్‌బీఎస్‌కే) భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో వివిధ రుగ్మతలు, అవయవలోపాలతో పుట్టే పిల్లలకు సత్వర సేవలు అందించడంలో జాప్యం జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 18 సంవత్సరాల్లోపు పిల్లల్లో నెలకొన్న సమస్యలకు ఈ కేంద్రంలో విధుల్లో ఉన్న వైద్య నిపుణులు స్క్రీనింగ్ చేసి తగిన వైద్యం అందించే ఆస్పత్రుల వివరాలను తెలిపి సిఫార్సు చేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా ప్రతి జిల్లాలోను జిల్లా ఆస్పత్రి ఆవరణలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ బాలల సత్వర చికిత్సా కేంద్రాలు గత జగన్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేశారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ ఇబ్బందులతో చిన్నారులను తీసుకుని తల్లిదండ్రులు ఈ కేంద్రానికి వస్తుంటారు. అయితే ఈ కేంద్రంలో సత్వర సేవలందాల్సిన సేవలు కొందరి వైద్యుల కారణంగా అలసత్వానికి గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కొందరు వైద్యులు తమ ఇష్టానుసారంగా కేంద్రానికి రావడం, హాజరుపట్టికలో సంతకం చేసేసి బయటకు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. చంటి పిల్లల వైద్యుడైతే ఒక గెస్ట్ డాక్టర్‌గా కేంద్రానికి ఏదోక సమయంలో వచ్చి వెళ్తారని, తణుకులో ఉన్న తన సొంత హాస్పిటల్‌లో సొంత వైద్యం చేసుకుంటున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రంలో వైద్యులు ఉండే సమయమని సిటిజన్ ఛార్టులు ఏర్పాటు చేసినా ఆ నిబంధనలు ఆచరణలో లేవని తెలుస్తోంది.

ఈ కేంద్రాల్లో వైద్యసేవలివి

నవజాత శిశువులకు వచ్చే రుగ్మతలతోపాటు 18 ఏళ్లలోపు పిల్లలు ఎదుర్కొంటున్న అవయవలోపాలు వంటి సమస్యలకు ఈ కేంద్రం పరిష్కారం చూపాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో 17 విభాగాలతో ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న భవనంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో చంటి పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్, ఫిజియోథెరపిస్ట్, కంటివైద్యులు, మానసిక వైద్యులు అందుబాటులో ఉండగా డెంటల్, ఈఎన్‌టీ వైద్యుల పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ఇద్దరు స్టాఫ్ నర్సులతోపాటు ఎల్‌టీ, స్పెషల్ ఎడ్యుకేటర్, సోషల్ వర్కర్, డెంటల్ అసిస్టెంట్ ఉన్నారు. ఈ కేంద్రంలో అప్పుడే పుట్టిన శిశువుల్లో జన్యు లోపాలు, న్యూరల్ ట్యూబ్, వంకర పాదాలు, గ్రహణం మొర్రి, అంగట్లో చీలిక, పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు, విటమిన్ లోపాలు, తీవ్రమైన రక్తహీనత, దృష్టి, వినికిడి, దంత సమస్యలతో పాటు చర్మవ్యాధులు, ఫిజియోథెరపి, సత్వర చికిత్స, మూర్ఛవ్యాధి, నాడి సంబంధమైన చలన సమస్యలు, ప్రవర్తన లోపం, బుద్ధి మాంధ్యం, మాటలు నేర్చుకోవడంలో ఆలస్యం, అభ్యసన వంటి సమస్యలతో ఇబ్బందులు పడేవారికి సత్వర వైద్యసేవలందించడమే ఈ కేంద్రం లక్ష్యం. ఇంతటి ప్రాధాన్యత ఉన్న కేంద్రంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతుందని ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరి వైద్యులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. అయితే జిల్లా ఆస్పత్రిలో ప్రతిరోజూ పుట్టే శిశువుల ఆరోగ్య పరిస్థితి కూడా ఈ కేంద్ర వైద్యులు నేరుగా వెళ్లి తెలుసుకోవాల్సిన బాధ్యత ఉన్నా ఆ దిశగా విధులు నిర్వర్తించడంలేదని సమాచారం. ఆస్పత్రి వైద్యవర్గాలు సైతం ఆస్పత్రిలోకి కేంద్రం వైద్యులు రావడం లేదని చెబుతున్నారు. కేంద్రంలో ఏ వైద్యుడు ఏసమయంలో వస్తున్నారు, ఏ సమయంలో వెళ్తున్నారనే విషయాన్ని ఆస్పత్రి ఆవరణలో ఉన్న సీసీ పుటేజీ చూస్తేనే తేటతెల్లమవుతుందని వైద్యవర్గాలు చెబుతున్నారు. ఈ సమస్యపై ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయాధికారి డాక్టర్ సీహెచ్ భావనను వివరణ కోరగా కేంద్రంలో వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పిల్లలకు సత్వర వైద్యం అందజేస్తున్నామన్నారు. వైద్యులంతా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విధుల్లో ఉండాల్సి ఉందని వైద్యులు విధుల్లో ఉండకపోవడం తమ దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి హైజంప్ పోటీలకు నానిబాబు ఎంపిక


నానిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూరెళ్ల నానిబాబు అండర్-17 హైజంప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూలు ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. శ్రీకాకుళంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నానిబాబును గ్రామ సర్పంచ్ తాడేపల్లి బేబి, వైస్‌ఎంపీపీ సూర్పని రామకృష్ణ, పాఠశాల పీడీ కొత్త సుభద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తికి గాయాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ):కుక్క అడ్డం రావడంతో బైక్‌దారుడు ఒకరు గాయపడిన సంఘటన పట్టణంలో కడకట్ల వద్ద మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. టూ టౌన్‌కు చెందిన 98 డీఎస్సీ ఉపాధ్యాయుడు గంధం ప్రభాకర్‌రావు టూ టౌన్ నుంచి మండలంలోని పుల్లాయగూడెం స్కూల్‌కు వెళ్లతున్నారు. రెండో ఫ్లైఓవర్ మీదుగా హౌసింగ్ బోర్డు వైపు బైక్‌పై వెళ్లతుండగా స్థానిక కడకట్ల రోడ్డు మార్గంలో ఊర కుక్క ఒకటి బైక్‌కు అడ్డం పడటంతో బైక్ స్కిడ్ అయ్యి పడిపోయారు. దీంతో ఆయనకు గాయాలైయ్యాయి. చేతులకు, జబ్బలకు గాయాలైయాయి. స్థానికులు గుర్తించి ప్రభాకర్‌రావును హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందజేశారు.

మాజీ మంత్రి కారుమూరికి అభినందనలు

వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా ఎంపికైన కారుమూరి


తణుకులో మాజీ మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించిన నేపథ్యంలో తణుకులో పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు. మంగళవారం తణుకు నివాసంలో ఆయనను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ పార్టీ శ్రేయస్సు కోసం అహర్నిశలూ శ్రమిస్తానని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా ఆచరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ఉండి పార్టీ కోసం పనిచేయాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, తణుకు పట్టణ, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు మంగెన సూర్య, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ ప్రచారకమిటీ జిల్లా అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, బల్లిపాడు సర్పంచ్ బాలాజీ, యిండుగపల్లి బలరామకృష్ణ, వి.సీతారాం, నూకల కనకదుర్గ, రేలంగి రాంబాబు, గారపాటి సత్యనారాయణ, వీరవల్లి శ్రీనివాస్, కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ పాల్గొన్నారు.

అపరిశుభ్ర పరిస్థితులను ఆన్‌లైన్ చేయాలి


దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అపరిశుభ్ర పరిస్థితులను ఆరోగ్య సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారావుపేట, వెంకట్రావుపాలెం గ్రామాల్లో వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక జనీత ప్రదేశాలను నిలువరించడం ద్వారా దోమల నుంచి వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అనుమానిత జ్వర కేసులకు ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ కాంతారావు, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు బేబి, లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కొండ్రుప్రోలు, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రేఖ మాట్లాడుతూ సాగులో సాంకేతిక పరికరాల వినియోగంపై రైతులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్, ఉద్యాన శాఖఅధికారి శ్రీలక్ష్మి, వెటర్నరీ డాక్టర్ దివ్యశ్రీ, ఆర్‌ఎస్‌కే ఇన్‌ఛార్జీలు మౌనిక, నవ్య పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటా


మాట్లాడుతున్న రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: రైతు సమస్యలపై పోరాడుతూ వారికి అన్ని విధాల అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్‌నాయుడు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని వీరంపాలెంలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ్‌నాయుడు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అధికారంలోకి లేకపోయినా రైతాంగానికి తోడు, నీడగా నిలుస్తానన్నారు. అనంతరం ఆయనను రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, కొప్పు వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం

అత్తిలి: ప్రతి ఒక్కరూ దంతాలు పట్ల శ్రద్ధ వహించి, దంత పరీక్షలు జరిపించుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శింగులూరి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం అత్తిలి లయన్స్‌క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అత్తిలి, భీమవరం విష్ణు దంతవైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శింగులూరి ఘంటారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన దంత వైద్య శిబిరంలో డాక్టర్ రామలక్ష్మి 109 మందికి దంత పరీక్షలు జరిపారు. వీరిలో 43 మందికి ప్రత్యేక కేసులుగా గుర్తించి మెరుగైన సర్వీసులు పొందడానికి విష్ణు డెంటల్ కళాశాలకు రిఫర్ చేశారు. దంత సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేసారు. సెక్రటరీ ఎస్ వెంకట నారాయణ, లయన్స్‌క్లబ్ కోశాధికారి బి గంగాధరరావు, క్లబ్ సభ్యులు ఎస్ బాబూరావు, డీసీ చైర్మన్ యాతం రాంబాబు, ఎస్‌ఎస్‌ఎన్ గుప్తా, డి మోహన్‌రావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన


కాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పెంటపాడు: వయస్సుతో నిమిత్తం లేకుండా మహమ్మారిగా విస్తరిస్తున్న కాన్సర్‌పై ప్రధానంగా విద్యార్థులు సరైన అవగాహన పెంచుకోవాలని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో పెంటపాడు పీహెచ్‌సీకి చెందిన డాక్టర్ తోట రాజేష్, మౌనికల ఆధ్వర్యంలో పి. యేసు జ్యోతి, తదితరులు విద్యార్థులకు కాన్సర్‌పై అవగాహన కల్పించారు. దీంతో పాటు ధూమపానం, మద్యపానం, పాస్ట్‌ఫుడ్, డ్రగ్, పొగాకు వంటి చెడు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ, సమాజాన్ని జాగృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా బ్లడ్ గ్రూపు, హిమోగ్లోబిన్, విద్యార్థినులకు ప్రత్యేక ఆరోగ్యపరీక్షలు చేసారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రాథమిక ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

30న జగన్నాథపురంలో రీ-సర్వే గ్రామ సభ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయం వద్ద ఈ నెల 30న ఉదయం 10 గంటలకు రీ-సర్వే గ్రామ సభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రీ-సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి, వాటిని పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు.

ఘనంగా పోలీసు అమర వీరుల దినోత్సవం


ఇరగవరంలో ఎస్సై జానా సతీష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: పోలీసులు, ప్రజలకు మధ్య స్నేహసంబంధం ఉండాలని ఎస్‌ఐ జానా సతీష్ తెలిపారు. మంగళవారం పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.ఎస్సై ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసు విధి, విధానం, వివిధ చట్టాలలు, ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల అడిగిన ప్రశ్నలకు పోలీసులు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పెనుగొండ: ఇటీవల అనారోగ్యానికి గురైన పెనుగొండకు చెందిన మోదుకూరి సీతారామ వైద్యం నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అందజేశారు. మంగళవారం కొమ్ము చిక్కాలలో జరిగిన కార్యక్రమంలో సీతారామ భర్త భవన్నారాయణకు రూ.67,550 చెక్కును అందించారు.

స్పీచ్ థెరపీతో ప్రత్యేక శిక్షణ


భవిత సెంటర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత సెంటర్‌లో స్పీచ్ థెరపీతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలు అన్నారు. పట్టణంలోని సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ నత్తి అవగాహన నివారణ దినోత్సవం జరిగింది. వక్తలు మాట్లాడుతూ నత్తి ఉన్న పిల్లలు ఉచ్చరణ, అక్షరాల, పదాలు పలకడంలోనూ, చదవడంలోనూ స్పష్టత ఉండదని, వారిని గుర్తించి స్పీచ్ థెరపీతో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. నత్తి వంశపారంపర్యంగా వస్తుందని, నత్తిని నివారించడానికి మందులు లేవని, ప్రత్యేక శిక్షణ అవసరం అన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు, ప్రత్యేక నిపుణులు సలహాలు, సూచనలతో పిల్లలతో మాట్లాడటం, చదివించడం ప్రాక్టీస్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, ఉపాధ్యాయిని కె.కుమారి, అంగన్‌వాడీ, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

నరసాపురం: వంటగ్యాస్ వినియోగం విషయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని గోదావరి గ్యాస్ (భారత్ గ్యాస్ ఏజన్సీస్) నరసాపురం శాఖ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గ్యాస్ వినియోగం విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వంట గ్యాస్‌ను పొదుపు చేస్తూ నే మరోవైపు వినియోగించే సమయంలో ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్యాస్‌కు నాణ్యత ఉన్న సంరక్షణ ట్యూబ్‌నే వినియోగించాలని చెప్పారు. ఐదేళ్లకు ఒకసారి ట్యూబ్‌ను మార్చాలని చెప్పారు. రాత్రి వేళల్లో కచ్చితంగా రెగ్యులేటర్‌ను కట్టేయాలని సూచించారు. గ్యాస్ లీకైనప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై డెమో నిర్వహించారు. కార్యక్రమంలో మెకానిక్స్ పి.శ్రీనివాస్, కె.సురేష్, ఎస్.శివ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రీసర్వే


ఏలేటిపాడు గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుందరరాజు


వెంకట్రామన్నగూడెం గ్రామంలో రీ-సర్వేపై అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

ఇరగవరం:భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సుందరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని ఏలేటిపాడు, అయితంపడి గ్రామాల్లో గ్రాబ సభ నిర్వహిచంరు. ఈ సభలో 27 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తేతలి రెవెన్యూ సదస్సులో 22 దరఖాస్తులు

తణుకు టౌన్: భూ రీసర్వేలో లోపాలను సరిచేసేందుకు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ కోరారు. మంగళవారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో భూ రీ సర్వేపై నిర్వహించిన గ్రామ రెవిన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామంలో భూ రీ సర్వేకు సంబందించి 22 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పీ గౌతమి, మండల సర్వేయరు దుర్గా ప్రసాద్, సచివాలయ కార్యదర్శి ఎం డాక్టర్ బాబు, వివిధ గ్రామాల సచివాలయ సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వే పొరపాట్లను సరిదిద్దేందుకు ప్రభుత్వం కృషి

తాడేపల్లిగూడెం రూరల్:రీ-సర్వేలో వచ్చిన పొరపాట్లను సరిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో రీ-సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలోజరిగిన సర్వేలలో లోపాలను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. పల్లె పండుగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, గ్రామ సభలు నిర్వహించడం ద్వారా ప్రతీ ఒక్కరి సమస్యలను తీర్చే దిశగా అధికారులు పనిచేస్తున్నారన్నారు. ప్రతీ గ్రామ అభివృద్ధిలో తమ వంతుగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఆర్డీవో భవానీ శంకరి, తహసీల్దార్ ఎ.సునీల్‌కుమార్ మాట్లాడారు. గ్రామ సర్పంచ్ పోలిమోను నాగ అంజూష, రీ-సర్వే డీటీ కాళీకృష్ణ, కూటమి నాయకులు అడపా ప్రసాద్, పాలూరి వెంకటేశ్వరరావు, పసుమర్తి రామ్‌లక్ష్మణ్, పైబోయిన వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.